www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 30 డిసెంబర్ 2025
5

సర్పంచ్‌కు సేవా రత్న అవార్డు

సర్పంచ్ మొహిద్దిన్

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురు సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ డాక్టర్ అబ్దుల్ కలాం సేవారత్న అవార్డు అందుకున్నారు. హైదరాబాదులో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయనకు ప్రశంసాపత్రంతో పాటు, షీల్డ్ పతకం అందించారు. అమెరికా లుధియానా యూనివర్సిటీ తనకు ఈ అవార్డు అందించారని గౌస్ మోహిద్దీన్ సోమవారం తెలిపారు. అఖిల భారతీయ ప్రతిభా మహా సమ్మేళనం ఆధ్వర్యంలో ఈ అవార్డుల ప్రధానోత్సవం జరిగిందన్నారు. సర్పంచ్ గా తాను ప్రజలకు అందించిన సేవలకు గుర్తింపుగా సేవారత్న అవార్డు అందించారని తెలిపారు. సర్పంచ్‌ను పంచాయితీ కార్యదర్శి డి.కృష్ణాజీ, సిబ్బంది అభినందించారు.

పట్టు పరిశ్రమలో సిబ్బంది కొరత

- ఉమ్మడి జిల్లాలో అరకొర సిబ్బంది
- కానరాని పట్టు పరిశ్రమ అభివృద్ధి
- తగ్గిన మల్బరీ తోటల సాగు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

పట్టు పురుగుల పెంపకం రైతులకు ఎంతో లాభసాటిగా ఉంటుంది. వాటి పెంపకానికి మన నేలలు కూడా అనుకూలంగా ఉన్నాయి. అయినా ప్రభుత్వం, అధికారులు పట్టుపురుగుల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించకపోవడంతో వారు ముందుకు రావడం లేదు. అధికారుల సూచనలు, సలహాలు లేకపోవడంతో పట్టు పరిశ్రమపై మంచి లాభాలు ఉన్నప్పటికీ కొన్ని మండలాలకే పంట సాగు పరిమితం అయింది. పెద్దగా పెట్టుబడులు అవసరం లేనప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పరిశ్రమ పట్టు తప్పుతోంది. ఖాళీ అవుతున్న ఉద్యోగాల స్థానంలో ఏళ్ల తరబడి భర్తీ చేయడం లేదు. కీలక అధికారులు, సిబ్బంది కొరతతో సమస్యలు ఏర్పడుతున్నాయి. దంతో రానురాను పట్టు పరిశ్రమ తగ్గుతూ వస్తుంది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని మెట్ట మండలాలైన గొల్లప్రోలు, తుని, కోటనందూరు, శంఖవరం, రౌతులపూడి, తొండంగి, రంగంపేట, పెద్దాపురం, పిఠాపురం, బిక్కవోలు తదితర 26 మండలాల్లో మల్బరీ తోటల సాగు చేస్తున్నారు. దాదాపు 4 వేల ఎకరాల్లో సుమారు 950 మంది రైతులు సాగు చేస్తున్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో కకూన్ మార్కెట్ ఉంది. ప్రతి నెలా ఆదాయం వచ్చే సాగు కాబట్టి రైతులు మరింత అవగాహన పెంచుకోవాలి. కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాలతో బాటు రంపచోడవరం డివిజన్లలో మల్బరీ పంట సాగు చేస్తున్నారు. రాష్ట్రంలో పట్టు పరిశ్రమ సంప్రదాయ జిల్లాలైన చిత్తూరు, శ్రీసత్య సాయి జిల్లాల తర్వాత 2022-23లో కాకినాడ జిల్లా పట్టు గూళ్ల ఉత్పత్తిలో 3వ స్థానంలో ఉంది.

నియామకాలు ఏవీ..?

జిల్లాలో పట్టు పరిశ్రమపై అభివృద్ధిపై ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదు. ఈ శాఖలో కొన్నేళ్లుగా నియామకాలు జరగకపోవడంతో అధికారులు, సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఉద్యోగ విరమణ పొందుతున్నారు తప్ప కొత్తగా నియామకాలు లేకుండా పోతున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధి డిప్యూటీ డైరెక్టర్ పోస్టు ఉన్నప్పటికీ వివిధ ఖాళీ పోస్టులు భర్తీ కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నలుగురు పట్టు పరిశ్రమ అధికారులకు ఒకరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అసిస్టెంట్ పట్టు పరిశ్రమ అధికారులు కూడా నలుగురికి ఒకరు, సాంకేతిక అధికారులు 10 మందికి రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సహాయ సాంకేతిక సిబ్బంది 24 మందికి ఒక్కరు మాత్రమే ఉన్నారు. మొత్తంగా 43 మందికి 12 మంది మాత్రమే పని చేస్తుండగా 31 ఖాళీ పోస్టులు ఉన్నాయి. అనేక ఏళ్లుగా ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఉన్న వారిపైనే అదనపు భారం పడుతుంది. రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చేవారు కరువవుతున్నారు

ఆర్‌ఎస్‌కెలకే విఎస్‌ఎలు పరిమితం

ఇటీవల సచివాలయ ఉద్యోగాల్లో కొంత మంది గ్రామ సెరి కల్చర్ సహాయకులను ప్రభుత్వం నియమించింది. గొల్లప్రోలు మండలంలో ముగ్గురు, ప్రత్తిపాడు మండలంలో ఇద్దరు, శంఖవరం, రౌతులపూడి, తుని, కోటనందూరు, రాజవొమ్మంగి, గంగవరం మండలాల్లో ఒక్కొక్కరు చొప్పున ఈ పోస్టులను భర్తీ చేశారు. అయితే వారు వ్యవసాయ శాఖ పరిధిలోనే విధులు నిర్వహిస్తున్నారు. పూర్తిగా రైతు సేవా కేంద్రాలకే పరిమితం కావడంతో మల్బరీపై రైతులకు ఎలాంటి సలహాలు, సూచనలు అందడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎడి స్థాయి అధికారులు క్షేత్ర సందర్శన చేసేందుకు సరైన వాహనాలు లేవు. ఉమ్మడి జిల్లా కార్యాలయాన్ని అద్దె భవనంలో కాకినాడలోని ఒక అపార్ట్మెంట్‌లో చిన్న ప్లాట్‌లో నిర్వహిస్తున్నారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయడం లేదు



జిల్లాలో సెరి కల్చర్ శాఖలో ఖాళీ పోస్టులు కొన్నేళ్లుగా భర్తీ కావడం లేదు. దీని వల్ల ఉన్నతాధికారులు, సిబ్బందిపై భారం పడుతోంది. ఖాళీ పోస్టుల విషయంపై ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే పోస్టులు భర్తీ అవుతాయని ఆశిస్తున్నాము.

- బి.గీతారాణి, పట్టు పరిశ్రమ జిల్లా అధికారి.

అర్జీదారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి, ఇతర అధికారులు

అర్జీదారుల సంతృప్తే గీటురాయి

ప్రజాశక్తి - అమలాపురం

అర్జీదారుల సంతృప్తే సేవల్లో నాణ్యతకు గీటురాయని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ప్రతి అర్జీని సకాలంలో నిబద్ధతతో పారదర్శకంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో డిఆర్ఒ కొత్త మాధవి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, సమగ్ర శిక్ష ఎపిసి జి.మమ్మీ, డిఆర్‌డిఎ పీడీ జయచంద్రగాంధీలతో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, ఉపాధి కల్పన, రెవెన్యూ సేవలకు సంబంధించి మొత్తం 280 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి, ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలనే సంకల్పాన్ని సాధించే దిశగా ఎంఎస్ఎంఇల ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై దృష్టి సారించాలన్నారు. కొత్త పారిశ్రామిక యూనిట్లతో పాటు ఉన్న యూనిట్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలను సత్వరమే గడువు లోపల పరిష్కరించాలన్నారు. ఒకే అంశంపై అర్జీలు పునరావృతం కాకుండా మెలుకువలు పాటించాలన్నారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను సత్వరమే నాణ్యతతో వంద శాతం పరిష్కరించాలని డిఆర్ఒ కొత్త మాధవి ఆదేశించారు. అందిన దరఖాస్తులను నాణ్యతతో పాటు నిర్దేశించిన సమయంలోపు పరిష్కరించాలన్నారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అందించిన వినతులను పరిశీలించి పరిష్కారానికి సంబంధించిన అర్జీని వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. న్యాయ సంబంధ మైన సమస్యల అర్జీలను పరిష్కరించడంలో అధికారులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు, వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లాస్థాయి అధికారులతోపాటు, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్, భరత్ పాల్గొన్నారు.

ఆర్‌డిఒ కార్యాలయం కొనసాగింపునకు ఆమోదం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయ కొనసాగింపునకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ రామచంద్రపురం, కె.గంగవరం మండలాలతో పాటు రామచంద్రపురం మున్సిపాలిటీతో కలిపి కొనసాగించేందుకు సోమవారం అమరావతిలో జరిగిన క్యాబినెట్ సమావేశం ఆమోదముద్ర వేసిందని తెలిపారు. రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ ఎత్తివేస్తున్నారంటూ కొందరు పనిగట్టుకుని ప్రజలను తప్పుదారి పట్టించేలా వ్యవహరించారని, ఇందులో ఎంతమాత్రం వాస్తవం లేదని కేబినేట్ ఆమోదం ద్వారా నిరూపణ అయిందన్నారు. కార్యాలయం తరలించకుండా కేబినేట్ ఆమోదం తెలపడం పట్ల సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్‌లను కలిసి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న మంత్రి సుభాష్

100 రోజుల ప్రణాళికను అమలు చేయాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు 100 రోజుల ప్రణాళికను అమలు చేయాలని డిఇఒ పి.నాగేశ్వరరావు ఆదేశించారు. సోమవారం మండలంలోని కొత్తలంక జడ్‌పి ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు అమలు చేస్తున్న యాక్షన్ ప్లాన్‌లో అలసత్వానికి తావు లేదన్నారు. షైనింగ్ స్టార్స్‌గా ఉన్న విద్యార్థులను రైజింగ్ స్టార్స్‌గా తీర్చిదిద్దాల్సిన బాధ్యత సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 19,645 మంది విద్యార్థులు పది పరీక్షలకు సన్నద్ధమవుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాట్రేనికోన

ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి సర్పంచ్ గంటి వెంకటసుధాకర్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.5 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కముజు మల్లికార్జునరావు, వార్డ్ మెంబర్ వాసంశెట్టి శ్రీనివాసరావు, నందికి శ్రీనివాస్, వైసిపి నాయకుడు సొల్లంగి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శిరోముండనం గాయానికి 30 ఏళ్లు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన వెంకటాయపాలెం దళిత యువకుల శిరోముండనం కేసుకు నేటితో 30 ఏళ్లు పూర్తయ్యాయి. 1996 డిసెంబర్ 29న జరిగిన ఈ సంఘటన జరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు అప్పటి ఎంఎల్‌ఎ తోట త్రిమూర్తులుతో సహ 10 మందిపై అభియోగాలు కొనసాగాయి. పలు అవాంతరాలు ఎదుర్కొన్న ఈ కేసు ఎట్టకేలకు 2024 విశాఖ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ ప్రత్యేక కోర్టు తోట త్రిమూర్తులుకు 18 నెలలు జైలు శిక్ష, జరిమానా విధించడంతో సహా మిగిలినవారికి శిక్షలు విధించింది. అయితే బాధితులకు 30 ఏళ్లుగా నష్టపరిహారం అందకపోవడం విశేషం. ఐదుగురు యువకులు శిరముండనం బాధితులు కాగా పువ్వుల గణపతి అనే యువకుడు ఇప్పటికే మృతి చెందాడు. ఈ కేసులో నిందితులు ప్రత్యేక కోర్టు శిక్షపై అప్పీల్ కి వెళ్లడంతో పాటు, బాధితులు ఈ కేసులో నిందితునికి తక్కువ శిక్ష పడిందని హైకోర్టును ఆశ్రయించారు. ఏడదిన్నర గడిచినప్పటికీ ఈ కేసు హైకోర్టు బెంచ్‌కి రాకపోవడంతో బాధితులు న్యాయం కోసం, నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. సుదీర్ఘకాలం కొనసాగిన ఈ కేసుకు ముగింపు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

శిరోముండనం బాధితులు(ఫైల్ ఫొటో)

అప్పట్లో టిడిపి ఎంఎల్‌ఎగా ఉన్న తోట త్రిమూర్తులు తదనంతరం పరిణామాలలో వైసిపి గూటికి చేరారు. ఈ కేసులో శిక్ష తగ్గించేందుకు గత ప్రభుత్వం కొంత సహకరించిందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం వైసిపిలో సుదీర్ఘకాలం కొనసాగిన ఈ కేసు ఇప్పటికీ దళితులకు మానని గాయంగా కొనసాగుతుంది. ఈ కేసులో బాధితుల యువకులకు నష్టపరిహారం ఇప్పించాలని, నిందితులకు శిక్షలు అమలు చేయాలని శిరోముండనం బాధితులు కోరుతున్నారు.

తోట త్రిమూర్తులు బెయిల్ రద్దుచేయాలి

శిరోమండలం కేసులో నిందితుడు తోట త్రిమూర్తులు బెయిల్ రద్దు చేయాలని, బాధ్యత యువకులకు వెంటనే నష్టపరిహారం అందించాలని దళిత ఐక్య పోరాట వేదిక నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2024 ఏప్రియల్‌లో విశాఖపట్నంలోని ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ ప్రత్యేక కోర్టు నిందితులకు శిక్ష విధించినా వారు హైకోర్టును ఆశ్రయించారని, కానీ నేటికీ బెంచ్ మీదకి రాకుండా ప్రధాన నిందితుడు తోట త్రిమూర్తులు అన్ని విధాల అడ్డంకులు సృష్టిస్తున్నాడని ఆరోపించారు. నాటి జగన్ ప్రభుత్వం శిరోముండనం నిందితులను రక్షించడానికి ప్రభుత్వ వ్యవస్థల్ని నిర్వీర్యం చేసిందని విమర్శంచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా నేటికీ ఆ కేసు హైకోర్టు బెంచ్‌కి రాకపోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో శిరోముండనం బాధితులు కోటి చినరాజు, చల్లాపూడి పట్టాభిరామయ్య, దళిత ఐక్య పోరాట వేదిక కన్వీనర్ వెంటపల్లి భీమశంకరం, ఐక్య వేదిక నాయకులు గుబ్బల శ్రీను, బి.సిద్ధూ, వెంటపల్లి రామకృష్ణ, చింతా రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన తలుపుల ఏర్పాటు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం ప్రధాన కాలువ నుంచి కొండయ్య సర్ ప్లస్ ద్వారా వెళ్లే సాగు నీటి కోసం ఏర్పాటు చేసిన తలుపుల్లో పోయిన రెండు తలుపుల స్థానంలో కొత్త తలుపులను సోమవారం ఏర్పాటు చేశారు. డిసి ఛైర్మన్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నీటి సంఘాల ప్రజాప్రతినిధులు సుమారు లక్ష రూపాయలతో తలుపులతో పాటు 2 గడ్డర్లను, మూడు అంగుళాల ఛానల్‌కు ఆరు బార్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన తలుపులకు మాచర నీటి సంఘం అధ్యక్షులు కొరపాటి జానకిరామయ్య, మాజీ అధ్యక్షులు త్రిపుర శెట్టి నాని, ఇరిగేషన్ అధికారులు, పూజలు నిర్వహించి ప్రారంభించారు. వృధాగా పోతున్న సాగునీరు అరికట్టడం జరిగిందని, పనులను పరివేక్షించిన తూర్పు డెల్టా ఇఇ ఇవివి.రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఆలమూరు-కోటిపల్లి ఎఇలు కృష్ణత్రిమూర్తులు, సాదు సుందర్‌సింగ్, ఎల్ఎస్.సత్యవతి, ఐసి అసిస్టెంట్స్ యువసాయి, ఆనందరాజు, తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన రోజున మొక్కలు నాటిన విద్యార్థిని

ప్రజాశక్తి - మండపేట

మండలంలోని ద్వారపూడి జడ్‌పి బాలికోన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థిని నిచ్చెనకోళ్ల కౌసల్య పుట్టిన రోజు సందర్భంగా పాఠశాల ఆవరణలో సోమవారం మొక్కలు నాటింది. ఆమె తల్లిదండ్రులు నిచ్చెనకోళ్ళ జార్జి, పుష్పలతో కలిసి ఆమె మేలు జాతి మామిడి మొక్కలను తెచ్చి నాటింది. ప్రతి ఒక్కరూ పుట్టినరోజును పురస్కరించుకుని ఒక మొక్క నాటి పకృతిని కాపాడాలని పిఎం ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ కంకటాల మురళీకష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



యాత్రికులకు మెరుగైన సేవలు

ఘనంగా ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారోత్సవం - పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపి గంటి హరీష్‌మాధుర్, ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం ఆలయ ఛైర్మన్, ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం కార్యక్రమం జరిగింది. దేవస్థానం పాలకమండలి ఛైర్మన్‌గా ముదునూరి వెంకటరాజు, ధర్మకర్తల మండలి సభ్యులుగా చలుమూరి రాంబాబు, గంగవరపు పద్మావతి, కాసా చాముండేశ్వరి, కొల్లుబోయిన శ్రీనివాసరావు, పెండెం కుమారి, పెండ్యాల భవాని, సలాది నాగేశ్వరరావు, సరళ సరిత, ఏపుగంటి విజయ కుమారి, చింతపల్లి సత్యనారాయణ, తమ్మన సాయిప్రసాద్, ఎల్లమల్లి చంద్రకుమారి, కొండపల్లి రామచంద్రరావు, శిష్టా సూర్య కుటుంబరావు, దళపర్తి శ్రీలక్ష్మి, గోసాల అప్పలనరస, ఆలయ ఎక్సఅఫీసియోగా వాడపల్లి సుందర శేషవతారం, ప్రత్యేక ఆహ్వానితులుగా మసకపల్లి త్రిమూర్తులు ప్రమాణస్వీకారం చేశారు. డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్‌రావు పాలకవర్గం సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత ఛైర్మన్ ముదునూరి వెంకట్‌రాజు తన నివాస నుంచి భారీ ర్యాలీగా ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎంపి, ఎంఎల్‌ఎలు ధర్మకర్తల మండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన పాలకవర్గం సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేయడంతోపాటు, యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం సెల్ఫీ పాయింట్‌గా అభివృద్ధి చేసిన స్వాతంత్ర సమరయోధుల స్థూపాన్ని వారు ప్రారంభించారు. రూ.80 లక్షలతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే ఆర్‌టిసి రిజర్వేషన్ కౌంటర్, రూ.20 లక్షలతో నిర్మించిన జలప్రసాదం కౌంటర్‌ను, రూ.9.25 లక్షలతో నిర్మించిన ప్రసాదం కౌంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఎంపి, ఎంఎల్‌ఎలను నూతన పాలకవర్గం గజమాలతో సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ దాట్ల బుచ్చిబాబు, ఎపి బిల్డింగ్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బండారు శ్రీనివాస్, రాజోలు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ గొల్లపల్లి అమూల్య, కూటమి పార్టీల నాయకులు అడబాల సత్యనారాయణ, గుత్తుల సాయి, ఆకుల రామకృష్ణ, బండారు సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలకవర్గం సభ్యులు, ఎంపి హరీష్‌మాధూర్, ఎంఎల్‌ఎ బండారు

ఈదరపల్లిలో ప్రత్యేక పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

మండలంలోని ఈదరపల్లి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులను సోమవారం పంచాయతీ కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదనంగా కార్మికులను నియమించి ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడుతున్నామని అన్నారు. జనవరి 4 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోలిశెట్టి వీరబాబు, పంచాయతీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

నేడు ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభం

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక మోబెర్లిపేటలో ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్‌ను మంగళవారం ప్రారంభించనున్నట్లు బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ జి.మోతిలాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బ్రాంచ్‌ను ఇండియన్ బ్యాంక్ జిఎం హైదరబాద్ నుంచి వర్చువల్ విధానంలో ఉదయం పదిన్నర గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మహేష్‌కుమార్ పాల్గొంటారని తెలపారు.

ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ర్యాస్ డ్రైవింగ్ చేస్తే ఖఠిన చర్యలు తప్పవని ఎస్ఐ డి.జ్వాలాసాగర్ హెచ్చరించారు. సోమవారం విద్యార్థినులు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవరిస్తున్న కొందరు ఆకతాయిలను సోమవారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ సైకిల్‌పై అతివేగంగా వెళితే కలిగే నష్టాలను వివరించారు. ర్యాష్ డ్రైవింగ్ వల్ల రహదారిపై వెళ్లే అమాయకులకు ప్రాణ నష్టం జరుగుతుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి - మండపేట

పట్టణంలోని 18వ వార్డులో రూ.27లక్షలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ అభివద్ధిలో భాగంగా సిసి రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ పర్యటనలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రగుంట అయ్యప్ప, మున్సిపల్ డిఇ కె.శ్రీనివాసు, ఎఇ డి.పవన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ముమ్మిడివరం విద్యుత్ సబ్ స్టేషన్ 11 కెవి ఫీడర్ పరిధిలో మరామ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ కె.రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముమ్మిడివరం, కొత్తలంక, కర్రివానిరేవు, గాడిలంక, అన్నంపల్లి, చింతపల్లి లంక, చిన్న కొత్తలంక, గేదెలంక, కోమానపల్లి, వరగల్లంక, వడ్డిగూడెం, గోదాసీవారిపాలెం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని తెలిపారు.

పేదలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మండలంలోని భీమనపల్లి ఆర్‌సిఎం చర్చ్‌లో క్రిస్మస్ సందర్భంగా సోమవారం పేదలకు చలి నుంచి ఉపసమనం కోసం దుస్తులు పంపిణీ చేశారు. ఫాదర్ నత్త పాలు అధ్య క్షతన జరిగిన కార్యక్రమంలో చల్లపల్లి అంబేద్కర్ నగర్‌కు చెందిన దేవరపల్లి సుబ్బన్న, జానకమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు దేవరపల్లి వెంకటరమణ, ప్రేమ కుమారి దంపతులు ఈ దుస్తులను అందజేశారు.

ప్రత్యేక సమావేశం కోసం వినతి

రామచంద్రపురం : ద్రాక్షారామ పంచాయతీలో అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ఉప సర్పంచ్, సహ పంచాయతీ కార్యవర్గ సభ్యులంతా సోమవారం గ్రామ కార్యదర్శి సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డిపిఒ, కలెక్టర్ దృష్టికి ఆయా సమస్యలను తీసుకెళ్తామని కార్యదర్శి తెలిపారని ఉపసర్పంచ్ బుచ్చిరాజు మీడియాకు వివరించారు.

నేరాలు ఘోరాలు

గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - కొవ్వూరు

గోదావరి నదిలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని కొవ్వూరు పట్టణ సిఐ పి.విశ్వం తెలిపారు. పట్టణంలో కొత్త శివాలయం సమీపంలో నదిలో తేలియాడుతున్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇచ్చారన్నారు. మృతుడు అయ్యప్ప మాల ధరించి ఉన్నాడని తెలిపారు. వయసు సుమారు 35 నుంచి 47 ఏళ్లు ఉండొచ్చన్నారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. మృతుని శరీరంపై నలుపు రంగు చొక్కా లుంగీ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహం పూర్తిగా పాడై ఉందన్నారు. సుమారు మూడు నాలుగు రోజులకు క్రితం మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నామన్నారు. వివరాల కోసం కొవ్వూరు పట్టణ పోలీస్ స్టేషన్లో లేదా 9440796622 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-కడియం

మండల కేంద్రమైన కడియం రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు.కడియం సిఐ అల్లు వెంకటేశ్వరరావు ఆదేశానుసారం ఎస్ఐ ధనలక్ష్మిప్రసన్న, ఎఎస్ఐ నాగేశ్వరరావు, కానిస్టేబుల్స్ మల్లికార్జున, వెంకట్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మండలంలోని జేగురుపాడు గ్రామ శివారు పాముల మెట్ట, జగనన్న కాలనీకి చెందిన జగతా గంగాధరం కుమారుడు జగతా శివ(19) ప్రమాదంలో మరణించినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

సాయం అందిస్తున్న తాడాల విష్ణుచక్రవర్తి

అగ్ని ప్రమాద బాధితులకు టివిసి ట్రస్ట్ సాయం

ప్రజాశక్తి - కడియం

ఆపదలో ఆదుకోవడాన్ని మించిన సంతృప్తి మరొకటి లేదని టివిసి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాడాల విష్ణుచక్రవర్తి అన్నారు. మండలంలోని దోసాలమ్మ కాలనీలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో యాల్లంశెట్టి సముద్రుడు, లక్ష్మిలకు చెందిన ఇల్లు పూర్తిగా కాలిబూడిదైంది. ఈ ప్రమాదంలో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. విషయం తెలుసుకున్న టివిసి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాడాల విష్ణుచక్రవర్తి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు. రూ.10వేల నగదు, 25 కేజీల బియ్యం, దుప్పట్లు, దుస్తులు సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో తాడాల కృష్ణకుమార్, కొత్తపల్లి శివాజీ, సాపిరెడ్డి కామేష్, చిరుకూరి రామకృష్ణ, గణేశుల చక్రవర్తి, మార్గాని బలరాం, తూపాటి వరాలు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఇఓ

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెరవలి

స్థానిక మండల వనరుల కేంద్రంలో 2026 యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను మండల విద్యా శాఖ అధికారులు బి.స్వరూప్, షేక్ సూర్జన్ సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వి.వెంకటరమణ, రాష్ట్ర కౌన్సిలర్ పి.వెంకటరాముడు, మండల అధ్యక్షుడు పి.నరేంద్ర బాబు, ప్రధాన కార్యదర్శి డివిఎస్ఆర్.తారాకృష్ణ, సహ అధ్యక్షురాలు వి.రాధిక, జిల్లా మహిళా సబ్ కమిటీ సభ్యులు టిసిహెచ్.సుమమ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవివిఎస్ఆర్.రాజేశ్వరరావు, కార్యదర్శులు వి.శ్రీనివాసరెడ్డి, పి.వినయ్‌కుమార్, షేక్ సూరాసాహెబ్, పతంజలి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారం నాణ్యతగా ఉండాలని అయా శాఖల అధికారులకు రాజమహేంద్రవరం ఆర్‌డిఒ కార్యాలయ పరిపాలన అధికారి ఎం.సుజాత సూచించారు. సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో వివిధ సమస్యల పరిష్కారం కోసం ఐదు అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నిర్ణీత గడువులోగా అర్జీలను పరిష్కరించాలన్నారు. పెండింగ్ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వాట్సప్ గవర్నెన్స్ నెంబర్ 9552300009 ద్వారా కూడా ప్రజలు సత్వర ప్రభుత్వ సేవలు పొందొచ్చన్నారు. ప్రజా సమస్యల పరిష్కారవేదిక ద్వారా ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆమె సూచించారు. ఆయా శాఖల వారీగా వచ్చిన అర్జీలను పరిశీలించి నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఆర్‌డిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ రాజరాజేశ్వరి విద్యాలయ విద్యార్థుల ఆర్థిక సాయం

చాగల్లు : మండలంలోని చాగల్లు శ్రీ రాజ రాజేశ్వరి విద్యాలయ విద్యార్థులు కొవ్వూరులోని ఆశ్రయ ఫౌండేషన్‌లోని క్యాన్సర్ రోగుల కోసం రూ.58వేల ఆర్థిక సాయాన్ని అందించారు. విరాళాలు సేకరించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ శాంతి నికేతన్ కరెస్పాండెంట్ మల్లిన ప్రవీణ్‌కుమార్, ఆశ్రయ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ విజయ్‌కుమార్, స్కూల్ కరస్పాండెంట్ వల్లిపల్లి వెంకటరామారావు, హెచ్ఎం కరీం, ఉపాధ్యాయులు కిషోర్ వినయ్ గౌడ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో రాజోలు

- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు
- రూ.400 కోట్లతో మౌలిక వసతులు
- ఎంఎల్ఎ కృషితో తాగునీటి పైలెట్ ప్రాజెక్టు

ప్రజాశక్తి - రాజోలు

గడిచిన ఏడాదిన్నర కాలంలో రాజోలు నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. దశాబ్దాలుగా అమలుకు నోచుకోకుండా ఉన్న ప్రధాన పనులు సైతం ఎట్టకేలకు కొలిక్కి వస్తున్నాయి. రాజోలు యోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ కృషితో కరెంటు, రహదారులతో పాటు తాగునీటి సౌకర్యం, ఇతరత్రా అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ దేవ వరప్రసాద్(ఫైల్ ఫొటో)

తాగునీటి పైలెట్ ప్రాజెక్టుగా రాజోలు

ప్రజల దాహార్తిని శాశ్వత ప్రాతిపదికన తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గోదావరి జలాలు శుద్ధిచేసి ఇంటింటికీ అందించేలా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు ఏర్పాటు చేయనుంది. 'అమరజీవి జలధార' నామకరణంతో పనులను ఇప్పటికే డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ప్రారంభించారు. రాజోలు ఎంఎల్ఎ పట్టుబట్టి రాజోలు నియోజకవర్గంను పైలెట్ ప్రాజెక్టుగా చేయాలని కోరారు. రాజోలు నియోజకవర్గం జిల్లాలో చివరలో ఉండడం, ఉప్పునీటి తీవ్రత అధికంగా ఉండడంతో మొదటి దశ పనులు పూర్తవుతాయని స్థానికులు భావిస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ సమీపంలోని బొబ్బర్లంక వద్ద గోదావరిలో ఏర్పాటు చేసే ఇన్‌టెక్ వెల్ నుంచి ప్రత్యేక పైప్ లైన్ ద్వారా నీటిని తరలించి ఆత్రేయపురం మండలం వెలిచేరులో ఏర్పాటుచేసే 75 ఎంఎల్‌టి ట్రీట్ మెంట్ ప్లాంట్‌కు తరలించి శుద్ధి చేస్తారు. ఆ నీటిని 5 మీటర్ల సామర్థ్యంతో ప్రత్యేక పైప్ లైన్ ద్వారా నియోజకవర్గానికి సరఫరా చేయనున్నారు. వచ్చే రెండేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తి అవుతుందని ప్రభుత్వం చెబుతోది. ఈ ప్రాజెక్టులో సుమారు రూ.495 కోట్లను రాజోలు నియోజకవర్గానికి కేటాయించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాజోలు నియోజకవర్గంలో తాగునీటి కష్టాలు దూరం కానున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ప్రజల భాగస్వామ్యంతో నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తా. ఇప్పటికే రూ.400 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాను. రానున్న మూడేళ్లలో మరో రూ.1500 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాను. పెండింగ్‌లో ఉన్న రైల్వే బ్రిడ్జి, మంజూరైన సఖినేటిపల్లి మండలం రామేశ్వరం–నరసాపురం బ్రిడ్జి పనులు ప్రారంభిస్తామని, కొబ్బరి అధారిత పరిశ్రమను తీసుకొస్తాను. నియోజకవర్గ ప్రజలు సహకరించాలి.

-దేవ వరప్రసాద్, ఎంఎల్ఎ, రాజోలు

లోవోల్టేజీ సమస్యకు చెక్

నియోజకవర్గంలో విద్యుత్ లోలోల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై దృష్టి సారించిన ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ ఇప్పటికే రూ.50 కోట్లతో సఖినేటిపల్లి మండలం గుడిమూల సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేసి అందు బాటులో తీసుకొచ్చారు, 2 సబ్ స్టేషన్లు మంజూరు దశలో ఉండగా, 151 ట్రాన్సఫార్మర్లు, కొత్తగా ఫీడర్ లైన్లు, పవర్ ట్రాన్సఫార్మర్లు ఏర్పాటు చేశారు. కొత్తగా మరో 188 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేసేందుకు ఆయన కృషి చేస్తున్నారు. రాజోలు మండలం శివకోటిలో మరో 132/33 కెవి సబ్ స్టేషన్‌ను నిర్మించేలా రూ.80 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. రూ.16 కోట్లతో 48 కి.మీ. ఇన్సులేటెడ్ వైర్లతో ఆధునికీకరించి అంతరాయంలేని నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసే చర్యలకు శ్రీకారం చుట్టారు. రూ.50 కోట్లతో వచ్చే 5 నెలల్లో పూర్తిగా సింగిల్ ఫేజు కరెంటు నుంచి 3 ఫేజు కరెంటుగా మార్పు చేసే పనులు చేపడుతున్నారు.

రోడ్లు, వంతెనలకు మోక్షం

రాజోలు నియోజకవర్గంలోని రోడ్లు, వంతెనలకు మోక్షం కలగనుంది. రూ.27 కోట్లతో 40 కిలోమీటర్ల మేర 20 రోడ్లను నిర్మించే పనులు మంజూరు అయ్యాయి. ఇప్పటికే ఆయా పనులను నియోజకవర్గవ్యాప్తంగా ప్రారంభించారు.

మురుగునీటి ముంపునకు విముక్తి

నియోజకవర్గంలో మురుగునీటి ముంపునకు విముక్తి కలగనుంది. నియోజకవర్గంలో 1 మేజర్ డ్రయిన్, 5 మీడియం డ్రయిన్లు, 25 మైనర్ డ్రయిన్లతో 163 కిలోమీటర్లు డ్రయినేజీ వ్యవస్థ విస్తరించి ఉంది. అస్తవ్యస్త డ్రయినేజీ నిర్వహణతో మురుగునీటి ముంపు సమస్య నెలకొంది. 23 కి.మీ మేజర్ డ్రయిన్ 8 కిలోమీటర్ల మేర మధ్యభాగంలో పూడిక తీయకపోవడంతో మురుగునీరు పారడం లేదు. దీంతో నియోజకవర్గంలోని 60 గ్రామ పంచాయతీల భూగర్భజలాలు ఉప్పునీటిమయంగా మారాయి. ఈ నేపథ్యంలోనే శంకరగుప్తం డ్రెయిన్‌కి రూ.20.62 కోట్లతో 8 కి.మీ పూడికతీత పనులు, 14.5 కి.మీ మేర గట్ల బలోపేత నిర్మాణ పనులకు డిసిఎం పవన్‌కల్యాణ్ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

యుటిఎఫ్ డైరీ ని ఆస్కరిస్తున్న ఎంఇఒ అప్పాజీ

యుటిఎఫ్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆలమూరు

ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) నూతన డైరీ, క్యాలెండర్, స్టిక్కర్, సెలవు దరఖాస్తుల పుస్తకాన్ని ఎంఇఒ బి.అప్పాజీ ఆవిష్కరించారు. సోమవారం స్థానిక జడ్‌పి పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఇఒ మాట్లాడుతూ ప్రతి ఏటా యుటిఎఫ్ ఆధ్వర్యంలో డైరీ, క్యాలెండర్, స్టిక్కర్, సెలవు దరఖాస్తు పుస్తకాలను ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయుల శ్రేయస్సుకు, విద్యార్థుల అభ్యున్నతికి యుటిఎఫ్ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల యుటిఎఫ్ అధ్యక్షులు జి.పుత్రకుమార్, ప్రధాన కార్యదర్శి దాసరి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎస్.సత్యవేణి, నాయకులు అద్దరి శ్రీనివాసరావు, గౌరి మల్లిక్, చంద్రమోహన్, ఎండి.అసదుల్లాఖాన్, వైవివి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ రాజేష్ కుమార్

జనవరి 2 నుంచి భూ-రీ సర్వే

ప్రజాశక్తి - మామిడికుదురు

మండలంలోని పెదపట్నంలంకలో జనవరి 2 నుంచి భూ -రీ సర్వే ప్రారంభం కానుందని డిప్యూటీ తహశీల్దార్ కె.శరణ్య తెలిపారు. సోమవారం పంచాయతీ కార్యాలయములో సర్పంచ్ సుందరనేడి రాజేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామంలో వారసత్వ భూములు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మూడు నెలలు పాటు సర్వే నిర్వహిస్తామన్నారు. నాలుగవ విడతగా పెదపట్నంలంక, అప్పనపల్లి, నగరం, పెదపట్నం గ్రామాలలో రీ- సర్వే నిర్వహిస్తున్నామన్నారు. రైతులు సహకరించి భూసమస్యలు పరిష్కరించుకోవాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో ఎంపిటిసి కొమ్ముల జంగమయ్య, మాజీ ఎంపిటిసి జోగి రామకృష్ణ, విప్పర్తి నాగేశ్వరరావు, కొమ్ముల దొరబాబు, పంచాయితీ కార్యదర్శి సత్యనారాయణ, ఆర్ఐ, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

పుష్పాల అలంకరణలో స్వామివారి ఆలయం

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ముక్కోటి ఏకాదశి సందర్భంగా వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో అవసరమైన ఏర్పాట్లును పూర్తి చేశారు. మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా యాత్రికులు స్వామివారిని ఉత్తరం ద్వారా దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, ధర్మకర్త మండలి సభ్యులు, డిసి నల్ల సూర్యచక్రధర్‌రావు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం ఐదు గంటల నుంచి యాత్రికులకు దర్శనాలకు అనుమతిస్తారని తెలిపారు. సుమారు లక్ష మంది యాత్రికులు వచ్చే అవకాశం ఉందని వారు తెలిపారు.

నేడు ముమ్మిడివరం కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం మంగళవారం ఛైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరుగుతుందని నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాలులో జరిగే ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు వివిధ శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

హైస్కూల్ ప్లస్ విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

స్థానిక జడ్‌పి బాలికల హైస్కూల్ ప్లస్ విద్యార్థినులు సర్టిఫికెట్ కోర్సులో ఉత్తమ ప్రతిభను చాటారని పాఠశాల హెచ్ఎం సిహెచ్.పరిమళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్రాస్ ఐఐటి స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాంలో భాగంగా ఇంటర్ విద్యార్థులకు బిజినెస్ మేటర్స్, మాథ్స్ కంప్యూటర్ విభాగల్లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కోర్సులో శిక్షణ పొందిన శిరిగినిడి రిషిఅమృత వందకు వంద మార్కులు సాధించగా, ఇళ్ల మహావిద్యాశ్రీ, రాచకొండ చంద్రిక 80 మార్కులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులతోపాటు, ఎస్‌పిఒసిగా వ్యవహరించిన టీచర్ డాక్టర్ సురేఖరాణిని హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - అమలాపురం

అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు నపూర్తి చేసినట్లు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ధర్మదాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన అంతర్వేది కల్యాణ ఉత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని విజయవం తంగా నిర్వహించాలన్నారు. భక్తుల తాకిడి రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్, పార్కింగ్, శానిటేషన్, తాగునీటి, విద్యుత్, వైద్య సేవలు, అగ్నిమాపక సౌకర్యాలపై శాఖల వారీగా స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలన్నారు జనవరి 28 కల్యాణోత్సవం, 29 రథోత్సవం ఫిబ్రవరి 1 చక్రస్నానం, ఫిబ్రవరి 2 తెప్పోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. ఎస్‌పి రాహుల్ మీనా మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు 1500 మంది పోలీస్ సిబ్బందిని నియమించడం జరుగుతుందన్నారు. ఆర్‌డిఒ కె.మాధవి మాట్లా డుతూ ఈ కల్యాణోత్సవం ద్వారా జిల్లాకు, అంతర్వేది ఆలయానికి ఉన్న గొప్ప ఆధ్యాత్మిక సంప్ర దాయాన్ని ప్రతిబింబించేలా అన్ని శాఖలు సమన్వయంతో అత్యుత్తమ నిర్వహణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఆర్‌డిఒలు పి.శ్రీకర్, టి.అఖిల, డిఎస్‌పి మురళీమోహన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

కోటిపల్లి రేవులో ప్రయాణాలు ప్రారంభం

ప్రజాశక్తి - రామచంద్రపురం

గత ఐదు నెలలుగా నిలిచిపోయిన కోటిపల్లి నుంచి ముక్తేశ్వరం గోదావరి రేవు మధ్య రాకపోకలు పున్ణప్రారంభం అయ్యాయి. సోమవారం ఉదయం 8 గంటలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి పంటు ప్రయాణాలను ప్రారంభించారు. వరదల కారణంగా గత ఐదు నెలల క్రితం కోటిపల్లి రేవు నుంచి రాకపోకలను అధికారులు నిలిపివేశారు. దీంతో రామచంద్రపురం నియోజకవర్గ పరిసర ప్రాంత ప్రజలు అమలాపురం వెళ్లాలంటే యానాం మీదుగా వెళ్లాల్సివచ్చేది. గత ఐదు నెలలుగా ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులకు ఇకపై చెక్ పడింది. రేవు వద్ద జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం, రేవు నిర్వాహకులు రేవు శ్రీను, పప్పుల సాయిబాబు, సర్పంచ్ పేమ్మాడ బేబీ సత్తిబాబు, మాజీ సర్పంచ్ కర్రి చిట్టిబాబు, కూటమి నాయకులు కంచుమర్తి బాబురావు, రవ్వా భూషణం, సలాది శీను, తదితరులు పాల్గొన్నారు.

రూ 70 లక్షలతో నిర్మించిన ర్యాంపు

వరదల కారణంగా ఇక్కడి ముత్యాలమ్మ వారిది కొట్టుకుపోయింది. దీంతో రేవులో ప్రయాణాలు నిలిచిపోయాయి.

రేవును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ప్రస్తుత రేవు కాంట్రాక్టర్ రేవు శ్రీను రూ.70 లక్షలతో ర్యాంపును నిర్మించారు. నెలసరి అద్దె ప్రాతిపదికన మండల పరిషత్ రేవు నిర్వాహణను కాంట్రాక్టర్‌కు అప్పగించింది. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ రేవు శ్రీను మాట్లాడుతూ ర్యాంపు నిర్మాణానికి నెల రోజులు పట్టిందని, ఒకటిన్నర కిలోమీటర్ల ర్యాంపుతోపాటు, ముత్యాలమ్మ వారధిని పునరుద్ధరించామని తెలిపారు. కోటిపల్లి రేవులో ప్రతి రోజు రెండు పంటు లను ఏర్పాటు చేసి ప్రయాణికుల సౌకర్యార్థం ఉదయం నుంచి సాయంత్రం వరకు రాకపోకలు ఉంటాయని తెలిపారు.

ఆర్థిక ప్రగతికి జీవనోపాధి యూనిట్లు దోహదం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మహిళలు ఆర్థిక ప్రగతికి జీవనోపాదుల యూనిట్లు ఎంతో దోహదం చేస్తాయని నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ తెలిపారు. సోమవారం స్థానిక 12వ వార్డులో క్రాంతి గ్రూప్ సభ్యురాలు వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీవనోపాదుల యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెప్మాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు గృహ అవసరాలకు వినియో గించే పినాయిల్, వాషింగ్ మిషన్ లిక్విడ్, ఫ్లోర్ క్లీనర్ లిక్విడ్, చీపుర్లు మరియు శానిటేషన్ సామాగ్రి విక్రయాలతో ఆర్థిక అవసరాలకు అనుగుణమైన ఉత్పత్తులను తయారు చేయటం ద్వారా మంచి లాభాలను సాధించవచ్చునన్నారు. అంతే కాకుండా చీరలు, పంజాబీ డ్రెస్సులు, పచ్చళ్ళ, తిను బండారాలు, జ్యూట్ బ్యాగులు, ఫ్లవర్ వాజ్‌లు, కొవ్వొత్తులు, పేపర్ ప్లేట్లు మరియు ఆర్గానిక్ ప్రొడక్ట్ తదితర ఉత్పత్తులతో మెరుగైన జీవన విధానాన్ని సాగించవచ్చునన్నారు. కావున ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, డ్వాక్రా మహిళలు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎం.బాలకృష్ణ, మెప్మా సిఎంఎం ఎస్.భాస్కర్, కోఆర్డినేటర్ దేవకీ దేవి, ఆర్‌పిలు పాల్గొన్నారు.

సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలపై అవగాహన

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం సూక్ష్మ, చిన్న, పెద్ద తరహా పరిశ్రమల స్థాపనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వమించారు. ఈ కార్యక్రమంలో ఏజెడ్ క్వాలిటీ డెవలప్‌మెంట్ జిల్లా కోఆర్డినేటర్ పోతుమూడి శేషారత్నం అధ్యక్షత వహించి మాట్లాడారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు 'జీరో డిఫెక్ట్, జీరో ఎఫెక్ట్' పద్ధతులను స్వీకరించడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. తద్వారా నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయడం, వ్యర్థాలను తగ్గించడం, శక్తిని ఆదా చేయడం, పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడం, పోటీతత్వాన్ని పెంచడానికి, మార్కెట్‌లను విస్తరించడానికి, గ్లోబల్ మార్కెట్‌లో ఎగుమతి చేయడానికి మార్గనిర్దేశం చేస్తుందన్నారు. అనంతరం ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ పిబిఎస్.దొర మాట్లాడుతూ ఉద్యమ ధృవీకరణ, జడ్ఇడి ప్లెడ్జ్‌పై అవగాహన కల్పించారు. అలాగే ఏజెంట్ క్వాలిటీ ఇన్‌స్పెక్టర్ రవితేజ మాట్లాడుతూ ధృవీకరణ స్థాయికి దరఖాస్తు, ప్రయోజనాలు, ఆర్థిక ప్రోత్సాహకాలు, హ్యాండ్ హోల్డింగ్ సపోర్ట్, మార్కెట్ ప్రవేశం వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం వివిఎస్.సత్తిబాబు, సిసిలు వనజ, వెంకటలక్ష్మి, జయంతి, అకౌంటెంట్ కుమార్, పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని ఉట్లుమిల్లి గ్రామానికి పితాని రాధాకృష్ణ గుండె పోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలోనే ఆయన స్నేహితులు రూ.1 లక్షను సేకరించి సోమవారం ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపదలో ఉన్న స్నేహితుని కుటుంబాన్ని ఆదుకోవడం తమ బాధ్యత అని స్నేహితులు అన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లి ప్రసాద్ స్వరాజ్‌కుమార్, సర్పంచ్ పిల్లి రాంబాబు, వరహాలరావు, దుర్గభవాని పాల్గొన్నారు.

పాతకోటలో ఇసుక అక్రమ తవ్వకాలు

పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసిన గ్రామస్తుడు

ప్రజాశక్తి - రామచంద్రపురం

కోటిపల్లి గోదావరి తీరంలోని పాతకోట ఏటిగట్టున ఇసుకను అక్రమంగా కొందరు తవ్వకాలు సాగిస్తున్నారు. కూళ్ల గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఏ విధమైన అనుమతులు లేకుండా గత రెండు రోజులుగా ప్రోక్లైనర్ సాయంతో ఇసుక తవ్వకాలను జోరుగా సాగిస్తున్నారు. ప్రభుత్వానికి చెందిన లంక భూమిలో అనధికారికంగా ఇసుకను తవ్వుకుపోయి సొమ్ములు చేసుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కోటిపల్లి పరిసర ప్రాంతాల్లో ఎటువంటి ఇసుక మట్టి తవ్వకాలు జరపవద్దని గ్రీన్ ట్రిబ్యునల్ పిటిషన్‌తో హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో కోటిపల్లి నుంచి మసకపల్లి వరకు ఎటువంటి ఇసుక, మట్టి తవ్వకాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే కొందరు మళ్లీ ఈ ప్రాంతంలో ఇసుక తవ్వకాలు చేపట్టడం చర్చానీయాంశంగా మారింది. దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు

పాతకోటలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను నిలువరించాలని పాతకోట గ్రామస్తుడు కోటిపల్లి వెంకటసుబ్రహ్మణ్యం పిజిఆర్ఎస్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. గతంలో ఇదే రీతిలో ఇసుకను తవ్వుతుంటే అధికారులు అడ్డుకున్నారని, మళ్లీ నెల తిరగకుండానే ఇసుకను తవ్వుతున్నారని ఫిర్యాదు చేసినట్లు ఆయన ప్రజాశక్తికి తెలిపారు.

ఇసుకను తవ్వుతున్న ప్రొక్లెయినర్

విచారణ చేస్తాం

పాతకోటలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై విచారణ చేపడతామని కె.గంగవరం మండల తహశీల్దార్ శ్రీరాంప్రసాద్ తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకాలను ఆయన దృష్టికి తీసుకురాగా, ఇసుక తవ్వకాలకు ఎవరికీ ఏ విధమైన అనుమతులు ఇవ్వలేదన్నారు. తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి డిప్యూటీ తహశీల్దార్, విఆర్‌ఒలను పంపించి విచారణ చేపడతామని ఆయన తెలిపారు.

PASSPORT MISSING

I, Yalamanchili Sathibabu, S/o. Somanaidu, D.No.3-36, Anjaneyaswami Temple Street, Near Railway Station, Kaldari, Undrajavaram Mandal, E.G.Dist., A.P., I lost my **Passport No.L6945075,** while i am travelling from Home to Xerox shop on Motor Bike on **Dt.20-12-2025.** If any one found please **Call : 63015 54706.**

CHANGE OF NAME

I, **BOJJA VARAHALA RAO** (New Name),aged 55 Years , S/o (Late) Bojja Apparao Resident of Address: D.NO. 16-42-47/A,5th Street, Sambamurthy Nagar, Kakinada (Urban) Kakinada District, A.P.
I have Changed My Name From BOJJA VARAHALU (Old Name). To **BOJJA VARAHALA RAO** (New Name) Hence Forth I Will be Called as **BOJJA VARAHALA RAO** (New Name) For all Purpose.

దస్తావేజు పోయినది

నా క్లయింట్ **అయినవర్తి శ్రీనివాస్,** తండ్రి : **సూర్యారావు** (లేటు), డోర్ నెం.1-30, వేలివెన్ను, ఉండ్రాజవరం మండలం, తూ.గో.జిల్లా. నా తండ్రి క్రియ దస్తావేజు 2/12/1969లో డాక్యుమెంట్ నిడదవోలు సబ్ రిజిష్టర్ కార్యాలయంలో రిజిష్టర్ కాబడినది. 1984లో మా ఇల్లు అగ్ని ప్రమాదమునకు గురై దస్తావేజు కాలిపోయినది. తేది.27-06-1994లో నిడదవోలు సబ్ రిజిష్టర్ ఆఫీసులో అప్లై చేయగా నకలు కాపీ ఇవ్వటం జరిగింది. ది.20-03-2021 మా తండ్రి గారు వీలునామా పత్రం 38/2021 నిడదవోలు సబ్ రిజిష్టర్ ఆఫీసులో వ్రాయడం జరిగింది. ఈ డాక్యుమెంట్ పై ఎవ్వరికి ఏవిధమైన హక్కులు లేవని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

జంగం వెంకటేశ్వరరావు
అడ్వకేట్, తణుకు, సెల్ : **9849559601**

IN THE COURT OF III ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE, KAKINADA
A.S.No.139/2025 in O.S.No.438/2015
Between :
Palivela Santosh Kumar,
S/o.Late Arjun Rao, Aged 66 years, Real Estate business, R/o. D.No.6-1, Indrapalem, Kakinada, Kakinada Rural Mandal.
..Appellant/Defendant
and
Vanga Mounika,
W/o.Vanga Raghavendra Deepak, D/o. Baka Venkata Baka Venkateswara rao, aged 34 years, R/o.H.No.2-43-17, Faces Beauty Clinic, Bhaskara Nagar, Kakinada, E.G.Dt., Rep by her General Power of Attorney Holder,
Baka Venkateswara rao,
S/o. (Late) Narasimha Murthy, aged 63 years, R/o. Qrt.No.E-22, Heavy Water Plant Colony, Aswapuram, Khammam District, A.P.
...Respondent/Plaintiff

పై నెంబర్ కేసు / అప్పీల్ AS.No.139/2025 in O.S.No.438/2015 లో కోర్ట్ వారి ఆర్డర్ ప్రకారం ఎన్ని పర్యాయములు అప్పీల్ నోటీసు పంపినప్పటికీ మీరు అనగా రెస్పాండెంట్ / ప్రతివాది Vanga Mounika, Rep by her GPA Holder Baka Venkateswara rao అందుకోనందున కొర్టు వారి ఆర్డర్ ప్రకారము మీకు ఈ పేపర్ ప్రకటన ద్వారా పై అప్పీల్ / కేసు **తేదీ.19-01-2026 న 10.30 నిమిషములకు** వాయిదా వున్నదని కావున మీరు గానీ లేదా మీ ప్లీడర్ గారి ద్వారా గానీ కోర్ట్‌లో తేదీ.19-01-2026 న హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపర్చుకోవలెను, లేని యెడల మీరు అనగా రెస్పాండెంట్ / ప్రతివాది పరోక్షమందు పై కేసు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

వక్కలంక సత్యనారాయణమూర్తి
M(T).రాజశ్రీ, T.S. రత్నాకర్, అడ్వకేట్స్,
డో.నెం. 7-9-29, సాంబమూర్తి వీధి,
రామారావుపేట, కాకినాడ. సెల్: 9849012112